సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

చారిత్రాత్మకమైన వేతన ఒప్పందాలు సిఐటియుకే సాధ్యం

- కార్మికులు ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకుంటాం : చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చారిత్రాత్మకమైన వేతన ఒప్పందాలు కేవలం సిఐటియుకే సాధ్యమని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, కిర్బీ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు తెలిపారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ఐలాభవన్‌లో జరిగిన కిర్బీ కార్మికుల సమావేశానికి చుక్కరాములు హాజరై మాట్లాడారు. అనేక పరిశ్రమల్లో ఏ యూనియన్ చేయలేని చారిత్రాత్మకమైన వేతన ఒప్పందాలు సిఐటియుకే సాధ్యమవుతున్నాయన్నారు. ఇప్పటికి రెండు మంచి వేతన ఒప్పందాలు సాధించామని తెలిపారు. కొత్త కొత్త సౌకర్యాలతో పాటు కార్మికులకు చట్టపరమైన హక్కులు కల్పించామన్నారు. కిర్బీ పరిశ్రమలో జరగబోయే వేతన ఒప్పందంతో పాటు అనేక ఇతర సౌకర్యాలు సాధిస్తామన్నారు. కాబట్టి కార్మికులంతా ఐక్యంగా ఉండాలని, ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. రాబోయే కాలంలో జరిగే గుర్తింపు సంఘ ఎన్నికల్లో సీఐటీయూను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజయ్య, మాణిక్యం, జనరల్ సెక్రెటరీ వీఎస్ రాజు, యూనియన్ నాయకులు మల్లేష్, నాగప్రసాద్, తలారి శ్రీనివాస్, మహేశ్వర్ రెడ్డి, ఏడుకొండలు, సోమన్న, రాములు తదితర కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వ విద్య వివక్షకు గురైంది

- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గత పదేళ్ల కాలంలో ప్రభుత్వ విద్య వివక్షతకు గురైందని, దాదాపు ఎనిమిది లక్షల విద్యార్థులు ప్రయివేటుకు తరలివెళ్లారని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ కళశాలలో నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది 16 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతిలో లక్షా 20 వేల మంది చేరితే, 11 వేల ప్రయివేటు పాఠశాలల్లో ఐదు లక్షల మంది విద్యార్థులు చేరారన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో నర్సరీ, కేజీ తరగతులు ఉండటం కూడా దీనికి ఒక బలమైన కారణమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం వెనుకడుగు వేస్తోందని అన్నారు. కేవలం 250 పాఠశాలల్లో మాత్రమే పూర్వ ప్రాథమిక తరగతులకు అనుమతి ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు వేల ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పెంచి అభివృద్ధి చేయాలి తప్ప కొత్త పాఠశాలలను ప్రారంభించడం అనాలోచిత నిర్ణయమని అన్నారు. దీనివల్ల నష్టమే తప్ప లాభం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగాన్ని కాపాడాల్సిన బాధ్యతను తీసుకోవాలని, అందుకు అవసరమైన ప్రయత్నాలు మొదలుపెట్టాలని కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతులు వెంటనే చేపట్టాలని, హెల్త్ కార్డ్స్ ప్రయోజనాలు అందేలా చూడాలని, పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పిఆర్‌సి అమలుకు ముందుకు రావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె కిష్టన్న, వి అశోక్, ఉపాధ్యక్షులు టి సూర్య కుమార్, కోశాధికారి కె శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు ఎ స్వామి పాల్గొన్నారు.

శాస్త్రీయ కళారూపాలను ప్రోత్సహించాలి

- రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి - కల్చరల్

శాస్త్రీయ కళారూపాలను ప్రోత్సహించడం భవిష్యత్తు తరాలకు ఎంతో అవసరమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అన్నారు. నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బాసర సరస్వతి అమ్మవారికి సంగీత నృత్య నిరాజనం 2025 పేరిట రవీంద్రభారతిలో నృత్య కళా ప్రదర్శనలు వైభవంగా నిర్వహించారు. నృత్య ప్రదర్శనలో వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు పాల్గొని కూచి పూడి, భరతనాట్యం, కథక్ వివిధ కళ రూపాల ప్రదర్శనను అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సభాకార్యక్రమానికి ఎంపి ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై పలువురు నృత్య గురువులను సత్కరించి, చిన్నారి కళాకారులను అభినందించి ప్రశంసాప త్రాలను అందజేశారు. అనంతరం ప్రముఖ కవి డాక్టర్ వేమూరి అనంత రామకృష్ణశర్మకు జ్ఞాన సరస్వతి అవార్డు, ప్రముఖ గాయని డాక్టర్ వేమూరి మంజులకు సరస్వతి నందీశ్వర అవార్డుతో పాటు 20 మంది ఆయా రంగాల ప్రముఖులకు అవార్డులను ప్రదానంచేసి, ప్రసంగించారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచ దేశాలకే ఆదర్శమని అన్నారు. అ లాంటి గొప్ప సంస్కృతిలో మనం పుట్టి నందుకు గర్వించాలని పేర్కొన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు భారతీయ సాంస్కృతి సంప్రదాయాలపై ఆసక్తి పెంచాలని సూచించారు. సంస్థ నిర్వాహకులు వీరేశ్ యాదవ్ ఏ కార్యక్రమం చేసిన ఎంతో వినూత్నంగా ఉంటుందని తెలిపారు. ఆయన దశాబ్దాల పాటు కలల్ని, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ సభాధ్యక్షత వహించిన వేదికపై సంస్థ అధ్యక్షులు వీరేష్ యాదవ్, రామ్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లంటే మోడీకెందుకంత నిర్లక్ష్యం

- టాప్రా కార్యాలయం ప్రారంభ సభలో ఎస్ వీరయ్య
- క్రమంగా తగ్గుతున్న పెన్షన్.. ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణం : అలుగుబెల్లి
- మోడీ కార్పొరేట్లకు బంటు : శ్రీకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెన్షనర్లంటే మోడీకంత నిర్లక్ష్యమేంటని నవతెలంగాణ పూర్వ సంపాదకులు ఎస్ వీరయ్య ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) ఆధ్వర్యంలో 'టాప్రా భవన్'ను ఎఐసిసిఇపిఎఫ్‌పిఎ చైర్మన్ ఎంఎన్‌రెడ్డి ప్రారంభించారు. దీనికి ముందు జాతీయ జెండాను మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సంఘం జెండాను టాప్రా సీనియర్ నాయకులు ప్రభాకర్ నాయర్ అవిష్కరించారు. టాప్రా ఉపాధ్యక్షులు యు ఆంజనేయులు, ఎఐఎస్‌జిఇఎఫ్ సెక్రటరీ జనరల్ శ్రీకుమార్ లిఫ్ట్, మీటింగ్ హాల్‌ను ప్రారంభించారు. టాప్రా అధ్యక్షులు పి నారాయణ రెడ్డి అధ్యక్షతన సభలో వీరయ్య మాట్లాడుతూ మార్కెట్ వ్యవస్థలో లాభమే ప్రధానమైందని చెప్పారు. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలు రిటైరైన ఉద్యోగులు కరివేపాకులాంటి వారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వారికిచ్చే పెన్షన్ వృధా పెట్టుబడి అని భావించటం దుర్మార్గం కాక మరేమిటని ప్రశ్నించారు. సోషలిస్టు దేశమైనా చైనాలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందన్నారు. తమ జీవిత కాలంలో సమాజానికి వారు చేసిన సేవ లాభాపేక్షే పరమావధిగా భావించే సర్కార్లకు వీరి బాధలు పట్టవని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే టాప్రా ఏర్పాటుకు ఒక ప్రత్యేక ఉందని చెప్పారు. సమాజంలో ఉన్న పెన్షనర్లందరినీ ఐక్యం చేయాలని ఆలోచిస్తున్నదన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు తప్పవని ఆ సంఘం భావిస్తున్నదని వివరించారు.

అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లకు క్రమంగా పెన్షన్ తగ్గుతుందని చెప్పారు. దీనికి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. సమాజానికి సేవ చేసిన వారికి మంచి జీవితాన్ని ఇవ్వాలనే లక్ష్యం ఈ సర్కార్లకు లేదని విమర్శించారు. అందరి కోసం పని చేసే సంఘం టాప్రా మాత్రమేనన్నారు. అంతరాల విద్య బలోపేతమవుతుందనీ, దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎన్‌రెడ్డి, శ్రీకుమార్, ప్రభాకర్ నాయర్, టాప్రా ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి, సిఐటియు కార్యదర్శి జె వెంకటేశ్, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకట్, ఎస్‌టిఎఫ్ఐ నాయకులు సంయూక్త, కాన్ఫడరేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు తదితర సంఘాల నేతలు మాట్లాడారు.

ఆరోగ్య భారత్‌లో హాస్పిటల్స్ కృషి మరువలేనిది

- భవిష్యత్‌లోనూ కొనసాగించేలా చూడాలి : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- త్వరలో జిల్లాల్లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్, కేర్ సెంటర్ల ఏర్పాటు : మంత్రి దామోదర
- అత్యున్నత శ్రేణి హాస్పిటల్‌గా 'బసవతారకం' : చైర్మన్ బాలకృష్ణ

వేడుకల్లో పాల్గొన్న గవర్నర్, మంత్రి దామోదర, చైర్మన్ బాలకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరోగ్య భారత్‌ను అందించడంలో హాస్పిటల్స్ చేస్తున్న కృషి భవిష్యత్‌లోనూ కొనసాగించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కోరారు. క్యాన్సర్ చికిత్సలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ రజతోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ హాజరై మాట్లాడారు. జీవించే హక్కును అందించడంలో బసవతారకం హాస్పటల్ ముందంజలో ఉందన్నారు. తాను లిఫ్టులో వస్తున్నప్పుడు ఆ లిఫ్టును వికలాంగుడు నిర్వహించడం చూశాననీ, ఇలాంటి రీతిలో ప్రభుత్వాస్పత్రుల్లో వికలాంగులకు ఉపాధి కల్పించవచ్చేమో ఆలోచించాలని మంత్రి రాజనర్సింహకు సూచించారు. అందరూ బాగుంటే సమాజం కూడా బాగుంటుందని, కేన్సర్‌తో బాధపడుతున్న వారికి స్వాంతన చేకూర్చడం ద్వారా బసవతారకం ముందుకు సాగుతోందన్నారు.

జిల్లాల్లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్లు : మంత్రి దామోదర

తెలంగాణలో ప్రతి ఏటా 50 నుంచి 55వేల మంది కొత్తగా క్యాన్సర్ బారినపడుతున్నారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రంలో నానాటికీ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయనీ, ప్రస్తుతమున్న ఎంఎన్‌జే, బసవతారకం హాస్పిటల్స్ పెరుగుతున్న కేసులకు సేవలందిస్తున్నప్పటికీ సరిపోవడం లేదన్నారు. ఎర్లీ స్టేజీలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేయొచ్చని తెలిపారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్లను ప్రారంభించనున్నట్టు తెలిపారు. అలాగే ప్రతి జిల్లాకో క్యాన్సర్ కేర్ సెంటర్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు. ఈ సెంటర్లలో క్యాన్సర్ స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్, డే కేర్ కీమోథెరఫీ, పాలియేటివ్ కేర్ వంటి సేవలన్నీ అందిస్తామన్నారు. ఇంకా అడ్వాన్స్‌డ్ వైద్య సేవలందించేలా రీజినల్ క్యాన్సర్ కేర్ సెంటర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. పేద రోగులకు సేవలందిస్తున్న బసవతారకం వంటి హాస్పిటల్స్‌కు ప్రభుత్వం తరుపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

అత్యున్నత శ్రేణి హాస్పిటల్‌గా 'బసవతారకం' : చైర్మన్ బాలకృష్ణ

2000వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ హాస్పిటల్ నేడు భారత దేశంలోనే అత్యున్నత శ్రేణి హాస్పిటల్‌గా రూపాంతరం చెందిందని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ చైర్మెన్ నందమూరి బాలకృష్ణ తెలిపారు. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా ఎన్నో చాలెంజింగ్ కేసులకు చికిత్స అందించాలన్నదే తమ అమ్మగారి కోరిక అని, దాన్ని పూర్తి చేయడం గర్వకారణమని చెప్పారు. వచ్చే ఏడాది ఇదే రోజు రజతోత్సవ ముగింపు వేడుకలను ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలో భారీ ఎత్తున నిర్వహించనున్నట్టు తెలిపారు. పూర్తిగా లాభాపేక్ష లేకుండా రోగి ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారనే భేదాలు చూపించకుండా క్యాన్సర్‌తో హాస్పిటల్‌కు వచ్చిన వారికి చికిత్స అందించే దిశగా సంస్థ పని చేస్తోందని వివరించారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లోనూ వెయ్యి పడకల హాస్పిటల్ నిర్మాణానికి స్వీకారం చుట్టనున్నట్టు తెలిపారు.

కార్మిక వర్గ ఐక్యతా పోరాటమే ఎస్‌డబ్ల్యుఎఫ్ విధానం

ఆర్‌టిసి పరిరక్షణ, కార్మికవర్గ హక్కుల కోసం పోరాడదాం : పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మిక వర్గ ఐక్యత పోరాట నినాదమే ఎస్‌డబ్ల్యుఎఫ్ విధానమని, కార్మికులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని, ఆర్‌టిసి కార్మిక వర్గానికి నష్టం కలిగించే ప్రభుత్వ యాజమాన్య విధానాలకు వ్యతిరేకంగా నికరంగా పోరాడే సంఘం ఎస్‌డబ్ల్యుఎఫ్ మాత్రమేనని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఖమ్మంలోని నేపాల్ దేవ్ భట్టాచార్య నగర్, యర్రా శ్రీకాంత్ ప్రాంగణం (ఐఎంఎ హాల్)లో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) 4వ రాష్ట్ర మహాసభల రెండో రోజున ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్‌టిసిలో సుదీర్ఘకాలం సాగిన 55 రోజుల సమ్మెలో ఆర్‌టిసి ఉద్యమానికి సిఐటియు అండగా నిలిచిందన్నారు. ఆర్‌టిసిని పరిరక్షించే సాధనం ఐక్యతా పోరాటమే అని, ఆ నినాదం మనదే అని, ఇప్పుడు అందరి నోటా ఐక్యపోరాటాలు వర్ధిల్లాలి అనే నినాదం వస్తుందని తెలిపారు. ఆర్‌టిసి కార్మికులు అనుభవిస్తున్న కష్టాలు, ఆర్‌టిసి ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణ, అవుట్‌సోర్సింగ్ విధానాలు, ఎలక్ట్రికల్ బస్సులు, పెరిగిన పనిభారాలన్నీ కూడా ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల ఫలితమేనని అన్నారు. కార్మికుల సంక్షేమంగానీ, వేతనాల గురించి గానీ, పని గంటల గురించి గానీ ప్రభుత్వాలు, యాజమాన్యాలు ఆలోచించడం లేదన్నారు. కార్మిక సంఘాలు లేని ప్రపంచం, కార్మిక సంఘాలు లేని భారతదేశం కోసం ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయన్నారు. స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ పాలకులనే ఎదిరించి పోరాడిన కార్మిక వర్గం భారతదేశంలో ఉందని, ఆ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని, జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా కార్మికవర్గం చేస్తున్న సార్వత్రిక సమ్మెలో ఆర్‌టిసి కార్మిక వర్గం సంపూర్ణంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ఉమెన్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్వీ రమ మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో మహిళల సౌకర్యాల గురించి, మహిళా హక్కుల గురించి చర్చించాలని, శ్రామిక మహిళలకు అండగా నిలవాలని తెలిపారు. ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్ జాతీయ కార్యదర్శి అర్మగనాయర్, ఆంధ్రప్రదేశ్ ఎస్‌డబ్ల్యుఎఫ్ కోశాధికారి దివాకర్ సౌహార్ధ సందేశమిచ్చారు.

అనంతరం 12 తీర్మానాలను మహాసభలో చర్చించి పలు సవరణలతో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆర్‌టిసి కార్మికులపై పెంచిన పనిభారాలు తగ్గించాలని, రిటైరయిన కార్మికులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని తీర్మానించారు. మహాలక్ష్మి స్కీమ్ నేపథ్యంలో వస్తున్న సమస్యలు పరిష్కరించాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాలకు స్వస్తిపలికి రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఎపి, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో ప్రయాణించే విధంగా సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి బస్సు పాసులు మంజూరు చేయాలని మహాసభలో తీర్మానించారు. ఈ మహాసభలో రాష్ట్రంలోని వివిధ డిపోలకు చెందిన 183 మంది ప్రతినిధులు హాజరై కార్యదర్శి నివేదిక తీర్మానాలపై విస్తృతంగా చర్చల్లో పాల్గొన్నారు. మహాసభల జయప్రదం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆహ్వాన సంఘం తరపున సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణ వెంకటేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. మహాసభల్లో తమ గళం ద్వారా పాటలతో అలరించిన ప్రజానాట్యమండలి బృందానికి, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏఐఆర్ టీడబ్ల్యుఎఫ్ ఖమ్మం జిల్లా నాయకత్వానికి ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టల సుధాకర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం లింగమూర్తి, ఆర్‌టిసి శ్రామిక మహిళ కమిటీ రాష్ట్ర నాయకులు జిల్లా పద్మావతి, ఖమ్మం రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు, గుగ్గిళ్ళ రోశయ్య, పగిళ్లపల్లి నరసింహారావు, గడ్డం వెంకటయ్య, వి.రమేష్, బుగ్గవీటి లింగమూర్తి, భాగ్యలక్ష్మి, మల్లికాంబ, పద్మ, విజయలక్ష్మి, సరిత, సీతారామారావు పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌తో డాక్టర్ నోరి దత్తాత్రేయుడు భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రముఖ క్యాన్సర్ వైద్యులు, పద్మశ్రీ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు భేటీ అయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. రాష్ట్రంలో క్యాన్సర్ కేర్ సిస్టం అభివృద్ధికి తాను అన్ని విధాలా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు సిఎంకు హామీ ఇచ్చారు.

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీ కరించండి

- మంత్రి సీతక్కకు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ అభయహస్తం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలని మాజీ మంత్రి హరిశ్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం పంచాయతి రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)కు లేఖ రాశారు. రాష్ట్రంలో గ్రామాలతో పాటు, పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి దయనీయంగా మారిందని లేఖలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీలకు ఇచ్చిన నిధులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శుల పనితీరు వల్ల తెలంగాణ గ్రామాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిధులు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు తమ సొంత నిధులు ఖర్చు చేస్తున్నారనీ, ఆ బిల్లులు రాక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. మాజీ సర్పంచులకు సైతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు లేఖలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలనీ, గతంలో చేసిన పనులకు మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి, పారిశు ధ్యం పెంపొందించాలని లేఖలో పేర్కొన్నారు.

In the Honble Court of the II Additional Junior Civil Judge at Vizianagaram
O.S.No. 517/2024

Between :
Sri Peratla Srirama Murthy ....Plaintiff
And :
M/s. Saharogya Health Care Pvt. Limited and another ......Defendants

Notice to Defendant No. 1&2

Defendant No : 1
M/s. Saharogya Health Care Pvt. Limited, D.No. 22-49, Flat No.402, Hardhik Platina, D.D. Colony, Bagh Amberpet, Hyderabad-500013, Talengana State.

Defendant No : 2
Sirivella Anil Kumar (CAO of M/s. Saharogya Health Care Private Limited) S/o. S.Ananda Kumar, D.No. 49-2-97, Urmila Nagar, Gunadala, Station Road, Vijayawada (Urban), Krishna Machavaram - 520004, Andhra Pradesh.

Hg date : 02-07-2025

పైన పేర్కొన్న ప్లయింటిఫ్ మీ ఇరువురు డిఫెండంట్స్ పై దావా వేసియున్నారు. సదరు దావాలో మీ ఇరువురు శ్రీ కోర్టువారి నుండి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకోనందున మీ ఇరువురి హాజరు నిమత్తం తే 02-07-2025దిన వాయిదా కలదని శ్రీ కోర్టువారి ఆదేశానుసారం ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము. కావున **తే 02-07-2025దీన ఉదయం గం॥ 10-30 ని॥లకు** మీరు ఇరువురు స్వయంగా కాని లేక వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో కోర్టువారు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఆర్డరు ప్రకారం)

బి.శ్రీనివాస్ కుమార్
ప్లయింటిఫ్ తరపున న్యాయవాది,
విజయనగరం,
సెల్ : 7780409899

ఉమ్మడి కరీంనగర్ జిల్లాను అగ్రగామిగా నిలపాలి

- జులై నాటికి ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి
- ఆయిల్ పామ్ పంట విస్తరణకు కట్టుదిట్టమైన చర్యలు
- రాబోయే మూడున్నర ఏళ్లలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు : మంత్రులు తుమ్మల, దుద్దిళ్ల, పొన్నం

సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రులు తదితురులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి ఒక్కరి సహకారంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లోని ఆడిటోరియం హాల్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలో వ్యవసాయశాఖ, విద్యాశాఖ, హౌసింగ్ తదితర శాఖల పనితీరుపై మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో కలిసి మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాల వారీగా సంబంధిత జిల్లా కలెక్టర్లు.. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, క్రాప్ బుకింగ్, సాగు వివరాలు, విత్తనాలు, ఎరువుల లభ్యత, రైతు భరోసా, ఆయిల్ పామ్ సాగు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, గ్రౌండింగ్ జరిగిన ఇండ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, బడి బాట, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను వివరించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న అస్తవ్యస్త పరిస్థితులను సరి చేస్తూ, ఆర్థికపరమైన వెసులుబాటు చేసుకొని పాలన సాగిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా ప్రజలకు మేలైన పాలన అందించాలని, ఎక్కడా ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలని సూచించారు. జులై వరకు అవసరమైన విత్తనాలు, ఎరువుల స్టాక్ జిల్లాల్లో అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఆయిల్ పామ్ సాగుపై మరింత శ్రద్ధ వహించాలని, పంట చేతికొచ్చిన రైతుల అనుభవాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ వీలైనంత ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ చేయాలని కోరారు. హార్టికల్చర్ అధికారులతో పాటు వ్యవసాయ శాఖలోని ఎఇఒ, ఎఒలు కూడా లక్ష్యాలు నిర్దేశించుకొని పని చేయాలని ఆదేశించారు. నగరం, పరిసర ప్రాంతాల్లో కూరగాయల సాగు పెద్ద ఎత్తున చేయాలని తెలిపారు. విద్యా శాఖ పట్ల జిల్లా కలెక్టర్లు శ్రద్ధ వహించాలని, ప్రయివేటు పాఠశాలల కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్య అందాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు పెంచాలని, ప్రభుత్వ పాఠశాలల్లో వస్తున్న మార్కులను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాబోయే మూడున్నర ఏళ్లలో సాచురేషన్ పద్ధతిలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని, వరికంటే రెండింతల ఆదాయం వచ్చే పంటలను రైతులకు సూచించాలని తెలిపారు. కల్తీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రైతు భరోసాను తొమ్మిది రోజుల వ్యవధిలో రూ. తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిన వ్యవసాయ శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఒక గుంట భూమి కూడా పడావు పడకుండా వ్యవసాయం సాగు జరగాలని అన్నారు. వరి మాత్రమే కాకుండా క్యాష్ క్రాప్స్, హార్టికల్చర్ పంటలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష, సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, మేడిపల్లి సత్యం, చింతకుంట విజయ రమణారావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, డాక్టర్ సంజయ్ కుమార్, కవ్వంపల్లి సత్య నారాయణ, గంగుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

పన్నేతర ఆదాయంపై దృష్టి సారించండి

- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పన్నేతర ఆదాయాన్ని పెంచడంపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించాలని మౌలిక సదుపాయాలు, మూలధన సబ్‌కమిటీ చైర్మన్, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సబ్ కమిటీ మంత్రివర్గ ఉప సంఘం భేటీ జరిగింది. అందులో మంత్రులు, కమిటీ సభ్యులైన ఉత్తం కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..పన్నేతర ఆదాయంతోపాటు కేంద్ర నిధులను కూడా సాధించుకోవాలని చెప్పారు. గత ప్రభుత్వ పథకాలను ఒక్కటి కూడా ఆపకుండా కొత్తగా రూ.33,600 కోట్ల విలువైన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఔటర్ రింగ్ రోడ్, ఎక్సైజ్ ఆదాయాలు రాకుండా పోయాయని చెప్పారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక, మహాలక్ష్మి, ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇండ్లు సహా పలు కొత్త పథకాలను ప్రజలకు ఇస్తున్నట్టు వివరించారు. బడ్జెట్ నిధులు కొన్ని శాఖలకు అధికంగా, మరికొన్ని శాఖలకు అతి తక్కువ అందుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇక నుంచి అన్ని శాఖలకూ నిధులు సమానంగా పంచేలా చూడాలని సూచించారు. శాఖల మధ్య ఖర్చు అంతరాలను తగ్గించాలనీ, అన్నింటిని ఒకే స్థాయిలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నియోజక వర్గాల్లో పెండింగ్‌లో ఉన్న మేజర్ ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. పబ్లిక్ ఇంట్రస్ట్, అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజా ప్రభుత్వం ఆలోచనల మేరకు అందరూ పని చేయాలని సూచించారు. రేషనలైజేషన్ మేరకు పనులను పూర్తి చేయాలనీ, స్పిల్ ఓవర్ వర్క్స్ కూడా ప్రయారిటీ మేరకు పూర్తిచేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమానంగా అభివృద్ధి చెందితేనే.. రాష్ట్రం సంపూర్ణ స్థాయిలో ముందుకెళ్తుందని చెప్పారు. రాబోయే పది రోజుల్లో రేషనలైజేషన్ పూర్తి చేసి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇ-వేలం - అమ్మకపు ప్రకటన

ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (బ్యాంక్రప్టసీ ప్రాసెస్ ఫర్ పర్సనల్ గ్యారంటర్స్ టు కార్పొరేట్ డెటార్స్) రెగ్యులేషన్స్, 2019లోని రెగ్యులేషన్ 27 తో చదవగల ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ 2016 కింద

శ్రీ.మలిరెడ్డి కోటి రెడ్డి, నివాసం: ఇ.నెం.7-18/1, అల్లివీడు గ్రామం, విజయ్ రాయ్ పంచాయతీ, పెదవేగి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534001 యొక్క బ్యాంక్రప్టసీ ప్రక్రియలో

బ్యాంక్రప్టసీ ట్రస్టీ కార్యాలయం:
రాజేష్ చిల్లాలే, బి-725, వెస్టన్ ప్లాజా, ఓయు కాలనీ, హెచ్ ఎస్ దర్గా, హైదరాబాద్- 500008
ఇమెయిల్: helapuri.pirp@gmail.com

బ్యాంక్రప్టసీ ఎస్టేట్‌లో భాగమైన బ్యాంక్రప్టసీ ప్రక్రియలో **శ్రీ.మలిరెడ్డి కోటి రెడ్డి** యొక్క ఈ క్రింది అసెట్స్ మరియు ఆస్తులను బ్యాంక్రప్టసీ ట్రస్టీ ద్వారా అమ్మకానికి ఉన్నాయి.

ఆస్తుల వివరణ	రిజర్వ్ ధర	ఈఎండి	బిడ్ పెంపు మొత్తం
రంగారెడ్డి జిల్లా, ఘట్కేసర్ మండలం, కొర్రెముల్ల గ్రామంలోని సర్వే నెం.353 & 354లో ఎక 11-34 గుంటల విస్తీర్ణం కలిగిన వ్యవసాయ భూమి మొత్తం మాలిరెడ్డి కోటి రెడ్డి పేరున ఉంది.	రూ.12.49 కోట్లు	రూ. 1.24 కోట్లు	రూ. 2 లక్షలు

1) అమ్మకం అనునది "ఎక్కడ ఉందో అలాగే","ఏదో అలాగే", మరియు ఏదేని రికోర్స్ లేకుండా" ప్రాతిపదికన జరుగుతుంది.
2) అమ్మకం దిగువ సంతకందారు ద్వారా ఇ-వేలం ప్లాట్‌ఫామ్ (5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో) ద్వారా జరుగుతుంది.
3) ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన వివరణాత్మక నియమ& నిబంధనల కోసం, ఆసక్తిగల దరఖాస్తుదారులు/పార్టీలు https://www.bankeauctions.com లో అందుబాటులో ఉన్న పూర్తి ఇ-వేలం ప్రక్రియ పత్రాన్ని చూడవచ్చు లేదా బ్యాంక్రప్టసీ ట్రస్టీకి ఇమెయిల్ పంపడం ద్వారా పొందవచ్చు.
4) ఇ-వేలం వివరాల కోసం సంప్రదించండి: శ్రీ పి.ధరణి కుమార్, ఫోన్ నెం.99481822 22, ఇమెయిల్: telangana@c1india.com లేదా బ్యాంక్రప్టసీ ట్రస్టీ: helapuri.pirp@gmail.com
5) ఆసక్తిగల పార్టీలు / బిడ్డర్లు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లను సందర్శించి బిడ్‌ను సమర్పించాలని కోరడమైనది.
6) ఇ-వేలం యొక్క ఏవైనా నియమ& నిబంధనలను ఆమోదించు లేదా రద్దు చేయడానికి లేదా పొడిగించడానికి లేదా సవరించడానికి బ్యాంక్రప్టసీ ట్రస్టీకి హక్కు ఉంది.
7) బిడ్ పత్రాలను సమర్పించడానికి చివరి తేదీ మరియు సమయం: **07.07.2025 సా.5.00 గంటలు.**
8) ఈఎండి డిపాజిట్ చేయడానికి, సైట్ సందర్శన, పత్రాల లభ్యతకు చివరి తేదీ & సమయం: **07.07.2025 సా.5.00 గంటలు.**
9) దరఖాస్తుదారుల బిడ్ ఫారమ్ ధృవీకరణ మరియు అర్హత కలిగిన బిడ్డర్లకు ఐడిల కేటాయింపు మరియు పాస్‌వర్డ్‌లను తెలియజేయడం పూర్తిచేయు తేదీ: **08.07.2025**
10) ఇ-వేలం తేదీ మరియు సమయం: **09.07.2025 ఉ.11:00నుండి మ.1:00 గంటల మధ్య.**

సం/-
రాజేష్ చిల్లాలే
IBBI/IPA-001/IP-P00699/2017-2018/11226
శ్రీ. మలిరెడ్డి కోటి రెడ్డి యొక్క బ్యాంక్రప్టసీ ప్రక్రియలో బ్యాంక్రప్టసీ ట్రస్టీ

ప్రదేశం: హైదరాబాద్
తేదీ: 23.06.2025

ప్రాణాలు తీసిన ఈత సరదా

- నీటిలో మునిగి ఇంటర్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరదాగా స్నేహితులతో కలిసి ఈత కొట్టడానికి వచ్చిన ఓ విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఇమ్రాన్ (17) అనే ఇంటర్ విద్యార్థి తన 11 మంది స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టడానికి మానస హిల్స్‌లోని స్వారీ గుంతల వద్దకు వచ్చారు. అక్కడ ఇమ్రాన్ ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడిపోయాడు. ఇది గమనించిన తోటి స్నేహితులు అతన్ని కాపాడడానికి ప్రయత్నించారు. కానీ అప్పటికే ఆ విద్యార్థి మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఇమ్రాన్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్‌లో ప్రతి ఒక్కరూ జైలుకే

- పిసిసి చీఫ్ మహేష్ కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్‌లో భాగం పంచుకున్న ప్రతి ఒక్కరూ జైలుకు వెళ్లడం ఖాయమని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుతో కోట్ల రూపాయలు నీళ్లల్లో పోసి నాసిరకం పనులు చేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల విషయంలో కీలకమైన బనకచర్ల విషయంలో వెనక్కి తగ్గేదేలేదన్నారు. నాయకులు, పారిశ్రామిక వేత్తలు, జడ్జీలు, సినీతారలు, బడా నాయకుల ఫోన్లు 650 ట్యాప్ చేసిన నీచమైన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదేనని విమర్శించారు. ట్యాప్ అయిన 650 మంది పేర్లు బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని, సిట్‌ను కోరారు. ట్యాప్ అయిన వారంతా స్వచ్ఛందంగా విచారణకు హాజరు కావాలన్నారు. కేసీఆర్, కేటీఆర్ ప్రమేయంతోనే ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు భావిస్తున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ విచారణపై నమ్మకం లేదన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కుమరం భీం టైగర్ కారిడార్ రద్దు చేయాలి

- ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేసే కుట్ర చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- టిఎజిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబూరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిఒ 49 టైగర్ కంజర్వేషన్‌ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఎజిఎస్) రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపి మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. ఈ జిఒతో ఆదివాసీలు సాగుచేస్తున్న భూముల నుంచి, వారు నివసిస్తున్న ప్రాంతాల నుంచి దూరం చేసి కార్పొరేట్ కంపెనీలకు అడవులను కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని, పోడు పట్టాలకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఎదుట టిఎజిఎస్ ఆధ్వర్యంలో ఆదివారం జీవో 49 పత్రాలను దహనం చేసి నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ అటవీ విధానంతో షెడ్యూల్ ప్రాంతాల్లోని వారి హక్కులను కాలరాసి అడవిలోని ఖనిజా సంపదలను పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు తీసుకొచ్చిందన్నారు. అందులో భాగంగా చత్తీస్‌గఢ్ ప్రాంతంలోని హస్దే అటవీ ప్రాంతంలోని 4 లక్షల ఎకరాలను అదానీకి అప్పజెప్పిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వమూ బిజెపి దారిలోనే ఆదివాసీలను అడవులనుంచి వెళ్లగొట్టే ఈ విధానాన్ని అమలు చేస్తున్నదని విమర్శించారు. ఇందులో భాగంగానే టైగర్ కంజర్వేషన్ కోసం ఎలాంటి గ్రామ సభలు జరుపకుండా, షెడ్యూల్ ప్రాంత రాజ్యాంగ హక్కులను సైతం గౌరవించకుండా 300లకు పైగా గ్రామాలను ఖాళీ చేయించి, వారిని భూముల నుంచి వెళ్లగొట్టేందుకే జిఒ 49 అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జిఒ పత్రాలను దహనం చేస్తున్న మిడియం బాబూరావు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గతంలో కవ్వాల్ టైగర్ జోన్ పేరుతో ఆదివాసీలను భూ నిర్వాసితులను చేసి వారికి ఎలాంటి పరిహారం చెల్లించకుండా వారి కుటుంబాలను రోడ్డు మీదికి లాగరాని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలివ్వాలని దరఖాస్తులు వస్తే కేవలం నాలుగు లక్షల ఎకరాల మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం పట్టాలిచ్చిందని, ఇంకా 8 లక్షల ఎకరాల భూమిని సాగు చేస్తున్న పోడుదారులకు హక్కు పత్రాలు ఇస్తామని ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన మాటను నిలబెట్టుకోలేదని, పైగా సాగుదారులపై ఫారెస్ట్ అధికారులతో దాడులు చేయించడం దుర్మార్గమని తెలిపారు. తక్షణమే సాగులో ఉన్న పోడు సాగుదారులకు హక్కు పత్రాలిచ్చి వారిపై అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి ఖాళీగా ఉన్న డాక్టర్, ల్యాబ్ టెక్నీషియన్, నర్సు పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. రవికుమార్, ఎర్మ పున్నం, కె శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆత్రం తనుష్, ఆత్రం కిష్టన్న, తొడసం శంబు, ఉయిక విష్ణు, వృత్తిదారుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్ పైళ్ల ఆశయ్య, నాయకులు అశోక్, రాజన్న, దర్శనాల మల్లేష్, సంకె రవి, కుశన్న రాజన్న, లంకా రాఘవులు, నైతం రాజు, కొట్నాక్ సక్కు తదితరులు పాల్గొన్నారు.

జాగృతి బిసి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు

- కవిత విన్నపానికి స్పందించిన ఆర్ కృష్ణయ్య
- జూలై 17 నాటి రైల్ రోకోలో పాల్గొంటామని ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జాగృతి బిసి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని కృష్ణయ్య ఇంటికి వెళ్లిన కవిత బిసి ఉద్యమానికి మద్దతివ్వాలని కోరారు. బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టాల్సిన ఉద్యమాలపై ఆరగంటకు పైగా చర్చించిన అనంతరం ఇరువురు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా జూలై 17న తలపెట్టిన రైల్ రోకో కార్యక్రమంతో సహా ప్రతీ కార్యక్రమంలో బిసిలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి అసెంబ్లీ పాస్ చేసిన బిల్లును ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఆరోపిం చారు. సిఎం రేవంత్‌రెడ్డి బిసిలకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాలి: కవిత

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాలని ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగంలోని 246బి ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కోసం జీవో ఇచ్చే అధికారం రాష్ట్రానికి ఉందని గుర్తు చేశారు. ఒక వైపు కేంద్రంపై ఒత్తిడి తేస్తూనే ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు. బిసిలపై ప్రేమను మాటలకే పరిమితం చేయకుండా చేతల్లో చూపెట్టాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే బిసిలకు చారిత్రక ద్రోహం చేసినట్లవుతుందని స్పష్టం చేశారు. పోరాటం చేయకపోతే భవిష్యత్తులో బిసిల రిజర్వేషన్లు తగ్గిపోయే ప్రమాదముందని హెచ్చరించారు.

కవితతో చర్చిస్తున్న ఆర్ కృష్ణయ్య

భైంసాలో భారీ చోరీ

- 30 తులాల బంగారం అపహరణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని రాహుల్‌నగర్‌లో ఓ ఇంట్లో శనివారం అర్ధరాత్రి భారీ దొంగతనం జరిగి 30 తులాల బంగారాన్ని ఆపహరించారు. పోలీసులు, బాదితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాహుల్‌నగర్‌లోని మచ్చ గజ్జరాం.. తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం పక్క మండల కేంద్రమైన నర్సాపూర్(జి)లో ఓ శుభకార్యానికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం, ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో దొంగతనం జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. భైంసా పట్టణ సిఐ గోపీనాథ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీమ్ రప్పించి ఆధారాలు సేకరించారు. 30 తులాల బంగారం, రూ.8వేల నగదు అపహరణకు గురైందని బాధితుడు గజ్జరాం ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటి సమీపంలో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. రాత్రి రెండు గంటల ప్రాంతంలో దుండగులు దొంగతనానికి పాల్పడినట్టు రికార్డయింది. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

నేడు క్యాబినెట్ భేటీ

- బనకచర్ల నీటి వివాదంపై కీలక చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో క్యాబినెట్ భేటీ కానుంది. బనకచర్ల నీటి వివాదం, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌పై క్యాబినెట్‌లో ప్రధానంగా చర్చించనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించనున్న బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందన్న ఆందోళన నేపథ్యంలో క్యాబినెట్ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఒకవైపు అధికార కాంగ్రెస్ ఆ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే...ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతోచర్చలు జరుపుతామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అవసరమైతే సుప్రీం కోర్టు మెట్లు ఎక్కుతామంటూ ప్రకటించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా విమర్శలు చేస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రకటించేందుకు క్యాబినెట్ సమావేశం నిర్వహిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ముందున్న ప్రధాన కర్తవ్యం స్థానిక సంస్థల ఎన్నికలే. అయితే ఎన్నికలకు వెళ్లే ముందుకు అసలు క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎలా ఉన్నాయో, ప్రభుత్వ పథకాలపై లబ్దిదారుల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయాలను ఆ జిల్లాల ఇంచార్జి మంత్రుల ద్వారా సీఎం తెలుసుకునే అవకాశం ఉన్నది. తొమ్మిది రోజుల్లో రైతుభరోసా పూర్తి చేస్తామంటూ ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగానే ఆ ప్రక్రియ పూర్తి కావొస్తున్నది. దీంతోపాటు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను గుర్తించడం, బెస్మెంట్ లెవల్ పూర్తయిన ఇండ్లకు నిధులు విడుదల చేయడం వంటి అంశాలపై క్యాబినెట్‌లో చర్చనున్నారు. వీటిన్నింటిపై ఇన్‌చార్జి మంత్రులు జిల్లాల్లోని ఉన్నతాధికారులతో ఇప్పటికే సమీక్షలు నిర్వహించారు. దీంతోపాటు మంత్రుల క్షేత్రస్థాయి పరిశీలనాంశాలను క్యాబినెట్‌లో ప్రస్తావించనున్నారు. వీటన్నింటి ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరు గిరిజనుల హత్య మావోయిస్టులు దుశ్చర్య

- పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరిహద్దు చత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలోని పమేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాంపూర్ సాండ్రా బోర్ గ్రామంలో జూన్ 21 రాత్రి మావోయిస్టులు ఇద్దరు వ్యక్తులను ఇన్‌ఫార్మర్ల నెపంతో హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుల్లో లొంగిపోయిన మావోయిస్టు సమ్మయ్య సునమ్, గ్రామస్తుడు వెకో దేవా (అలియాస్ లఖ్మా) ఉన్నారు. వారిద్దరినీ పోలీసు ఇన్‌ఫార్మర్లుగా ఆరోపించి మావోయిస్టులు ఈ ఘటనకు పాల్పడ్డారు. జర్పల్లి ఆర్‌పిసి సభ్యునిగా ఉన్న సమ్మయ్య సునమ్ 2025 జనవరిలో లొంగిపోయాడు. ఈ హత్యాకాండ సంఘటన తర్వాత ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. పామేడ్ పోలీసులు దీనిపై దర్యాప్తు చేస్తున్నారు.

పర్యవేక్షణ బాధ్యతల ఉత్తర్వులు నిలిపివేయాలి

- డిటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయులు పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు యం. సోమయ్య, టి.లింగారెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది విద్యారంగ తిరోగమన చర్య అని వారు విమర్శించారు. కామన్ సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి పూర్తిస్థాయి మండల విద్యాధికారులను, ఉప విద్యాశాఖ అధికారులను, జిల్లా విద్యాశాఖాధికారులను నియమించి పాఠశాలల పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు. తరగతికి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలనీ, డిఎస్‌సి ప్రకటించి ఉపాధ్యాయులను నియమించాలని వారు డిమాండ్ చేశారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

ప్రాజెక్టులపై సిబిఐ విచారణ జరపాలి

- కెసిఆర్ కుటుంబానికి ఎటిఎంగా మారిన కాళేశ్వరం
- బిఆర్ఎస్, కాంగ్రెస్ బొమ్మాబొరుసులు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ కుటుంబానికి ఎటిఎంగా మారిందని ప్రధాని మోడీ పార్లమెంట్‌లో చెప్పారని, అదే తమ పార్టీ అధికారిక అభిప్రాయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని మైత్రి హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. రూ.38 వేల కోట్లతో నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టు రూ.1.2 లక్షల కోట్లకు పెరిగిందని, వేల కోట్ల అవినీతి జరిగిందని, ఈ ప్రాజెక్టు పేరుతో ముత్యాల్ని ముడివేసినట్టు కోట్లాది రూపాయల దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. గత ఎన్నికల్లో రాహుల్‌గాంధీ స్వయంగా కాళేశ్వరంపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారని గుర్తుచేస్తూ, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా సిబిఐ విచారణ ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. కెసిఆర్‌పై చర్యలకు కాంగ్రెస్ వెనుకాడుతుండటం చూసి ప్రజలు బిజెపికే పూర్తి మెజారిటీ ఇవ్వాలని నిర్ణయించుకున్నారని అన్నారు. కెసిఆర్‌పై ఉన్న ఆరోపణలన్నింటికీ రేవంత్ రెడ్డి రక్షణ కవచంలా వ్యవహరిస్తున్నారని, కెసిఆర్ కుటుంబం అరెస్టుకైనా, విచారణకైనా దూరంగా ఉండటమే దీనికి నిదర్శనమని అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు విచారణలు, డ్రామాలకే పరిమితమని, కెసిఆర్‌పై అసలైన చర్యలు తీసుకోవాలంటే కేంద్రం నేరుగా సిబిఐతో విచారణ జరిపించే అవకాశముందని తెలిపారు. బిజెపి అధికారంలోకొచ్చిన వెంటనే కేసీఆర్, సహ బాధ్యులను శిక్షిస్తామని స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టి వద్ద 165 టిఎంసిల నీటి లభ్యత ఉందని సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదిక ఇచ్చినా, ఆ ప్రాంతాన్ని వదిలేసి కొత్త ప్రాజెక్టు రూపకల్పన చేయడం కమీషన్ల కోసమేనని ఆరోపించారు. కాళేశ్వరం భద్రతపై ఏకంగా పార్లమెంట్ ఆమోదించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) నివేదికను కూడా బేఖాతరు చేయడం సరికాదన్నారు. బిజెపి కుటుంబ పార్టీలు, అవినీతి పార్టీలను దరిదాపుల్లోకి కూడా రానీయదని, బిఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుంటామన్నది అపోహ మాత్రమే అని తెలిపారు.

భాషా పండితుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తా

- ఎంపి డాక్టర్ మల్లు రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భాషా పండితుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని నాగర్ కర్నూల్ లోక్‌సభ సభ్యులు డాక్టర్ మల్లు రవి హామీ ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఆవరణలోని గల సర్వోదయ సమితి కార్యాలయంలో ఆర్‌యుపిపి-టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు శానమోని నర్సింహులు అధ్యక్షతన కోర్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశియాదవ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. సంఘ పటిష్టత పూర్తిస్థాయి కార్యవర్గం తదితర పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. అనంతరం మల్లు రవిని కలిసి, రాష్ట్రంలో అప్ గ్రేడ్ కాకుండా మిగిలిపోయిన 800 మంది ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషాపండితులను అప్ గ్రేడ్ చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సమావేశంలో కోర్ కమిటీ సభ్యులు యం.ఎన్.విజయ్ కుమార్, లెంకల రాంరెడ్డి, గోపాల్ జీ, సుధాకరాచారి, వెంకటస్వామి, ప్రవీణ్ కుమార్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతో మాల మాదిగలు జతకట్టాలి

- దేవని సతీష్ మాదిగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వంలో మాలమాదిగలు జతకట్టాలని ఎంఆర్‌పిఎస్ పౌండర్ జనరల్ సెక్రటరీ దేవని సతీష్ మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సింహ భాగం దళితులకు చోటు దక్కిందని పేర్కొన్నారు. ఐదు మంది దళితులు మంత్రులుగా ఉండటం ఇదే మొదటి సారని తెలిపారు. కృతజ్ఞతగా త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతో నెహ్రూ బాలభవన్ అధ్వాన స్థితి

- తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలకుల నిర్లక్ష్యం, అధ్యాపకుల కొరతతో నెహ్రూ బాల భవన్ అధ్వాన స్థితిలో ఉందని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. బాల భవన్ స్థాపించి 60 ఏళ్లయిన సందర్భంగా బాల భవన్‌లను అధ్యయనం చేసి పరిశోధించిన అంశాలపై ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని టిపిఎస్‌కే హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద పిల్లల మానసిక వికాసానికి ఉపయోగపడాలనే సదుద్దేశంతో స్థాపించిన బాల్‌భవన్‌లు నేటి పాలకుల ఉదాసీనత వాటికి శాపంగా మారిందన్నారు. హైదరాబాద్ బాల భవన్ డైరెక్టర్ విజయ లక్ష్మికి పిల్లల గురించి ఆలోచించే తీరిక లేదని తెలిపారు. కొంతమంది ఉన్నతాధికారులకు బాలభవన్ ఉపాధి హామీ పథకంగా మారిందన్నారు. ఇక్కడ ఆటలు, పాటలు, కళలు, నాట్యం, మృదంగం లేవని, కానీ 15 మంది సిబ్బంది ఉంటారని వారు ఏం చేస్తారో కూడా తెలియదని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందన్నారు. బస్సు ఉంది డ్రైవర్ లేదని, సైన్సు ల్యాబ్ ఉంది సైన్స్ టీచర్ లేదని, విశాలమైన గదులున్నాయి కానీ అధ్యాపకుల లేరని తెలిపారు. మూడంతస్తుల భవనం చుట్టూ చెట్లు, అద్భుతమైన వాతావరణం అయినా ఆటలు, పాటలు లేవన్నారు. బాల భవన్ స్థితిపై రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 11 ఏళ్లుగా ఇద్దరు సిఎంలు మారినా ఇక్కడ ఏం మారలేదన్నారు. 50శాతం పిల్లలు, మహిళలు పౌష్టికాహార లేమితో అవస్తలు పడుతుంటే మోడీ యోగా ఒక్కటే సర్వరోగ నివారిణి అంటున్నారని విమర్శించారు. జానపద వృత్తి కళాకారుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మురళీధర్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం అందుబాటులో లేకపోవడానికి కారణాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉన్న జవహర్ బాల భవన్‌లు వెంటనే పునరుద్ధరించి నిరుపేద పిల్లలకు ఉపయోగపడేలా నిబంధనలు రూపకల్పన చేయాలని కోరారు. ఓటు హక్కు లేని పిల్లలే కాదా అని అనుకుంటున్నారో.. ఆ పిల్లలే పిడుగులుగా మారి పాలకులను మార్చిన చరిత్ర ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం నాయకులు పొన్నం రాజయ్య, మహేష్ దుర్గే, విజ్ఞాన దర్శిని జీవన్ ఆనంద్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో నినాదాలు చేస్తున్న భూపతి వెంకటేశ్వర్లు తదితరులు

ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతల సరికాదు

- ఆ ఉత్తర్వులు విరమించుకోవాలి : ఎస్‌టియు టిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతను ఉపాధ్యాయులకు అప్పగించడం సరికాదని ఎస్‌టియు టిఎస్ ఆక్షేపించింది. ఈ మేరకు ఆదివారం ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పర్వత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు వేల మందికిపైగా ఉపాధ్యాయులను ఏడాది పొడవునా తనిఖీ బాధ్యతల్లో ఉపయోగిస్తే ఆయా పాఠశాలల్లో బోధన స్థంభించిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

కామన్ సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి పూర్తిస్థాయి మండల విద్యాధికారులను, ఉప విద్యాశాఖ అధికారులను, జిల్లా విద్యాశాఖాధికారులను నియమించి పాఠశాలల పర్యవేక్షణ కొనసాగించాలని వారు సూచించారు. తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలనీ, వెంటనే డిఎస్‌సి ప్రకటించి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.

కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలి

- టిపిటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను రద్దు చేయాలని, పాఠశాల పర్యవేక్షణకు టీచర్లను నియమించడం సరికాదనీ, కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగుల సమస్యలపై క్యాబినెట్ నిర్ణయాలకు ఉత్తర్వులు విడుదల చేయాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాదులోని పర్వానా హాల్‌లో రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ బదిలీలు నీతి, నిజాయితీతో పని చేసే ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యం దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, టిపిఎస్, టిఎఫ్ఎస్ పాఠశాల ఏర్పాటు ప్రస్తుత విద్యా విధానానికి ప్రత్యామ్నాయం కాదని చెప్పారు. కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేస్తూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిపినప్పుడే తల్లిదండ్రులకు ప్రయివేటు పాఠశాలల దోపిడీ నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలకు సంబంధించి కేబినెట్ తీసుకున్న నిర్ణయాలన్నింటిని అమలు చేయాలని, పెండింగ్ బిల్లులకు సంబంధించి జూన్ నెలకు రూ.700 కోట్లు విడుదల చేయాలనీ, హెల్త్ కార్డులు సక్రమంగా పని చేసేందుకు వీలుగా ట్రస్ట్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. హాజరైన కార్యవర్గ సభ్యులు నివేదికలోని ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు, సామాజిక అంశాలు, సంస్థ చేపట్టిన ఉద్యమాలు, చేసిన ప్రాతినిధ్యాలపై చర్చించి ఆమోదించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులు, ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు ఎం ప్రకాశ్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి మహేందర్ రెడ్డి, పి నారాయణమ్మ, డి శ్రీనివాస్, ఎం లక్ష్మయ్య యాదవ్, ఎం కృష్ణారెడ్డి, కార్యదర్శులు ఎస్ విజయ్, వై పద్మ , బి రమేష్, ఎస్ కవిత, ఆర్ రమేష్, డి రాజయ్య హాజరయ్యారు.

శాస్త్రీయ కళారూపాలను ప్రోత్సహించాలి

- రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి - కల్చరల్

శాస్త్రీయ కళారూపాలను ప్రోత్సహించడం భవిష్యత్తు తరాలకు ఎంతో అవసరమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అన్నారు. నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బాసర సరస్వతి అమ్మవారికి సంగీత నృత్య నిరాజనం 2025 పేరిట రవీంద్రభారతిలో నృత్య కళా ప్రదర్శనలు వైభవంగా నిర్వహించారు. నృత్య ప్రదర్శనలో వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు పాల్గొని కూచి పూడి, భరతనాట్యం, కథక్ వివిధ కళ రూపాల ప్రదర్శనను అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సభాకార్యక్రమానికి ఎంపి ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై పలువురు నృత్య గురువులను సత్కరించి, చిన్నారి కళాకారులను అభినందించి ప్రశంసాప త్రాలను అందజేశారు. అనంతరం ప్రముఖ కవి డాక్టర్ వేమూరి అనంత రామకృష్ణశర్మకు జ్ఞాన సరస్వతి అవార్డు, ప్రముఖ గాయని డాక్టర్ వేమూరి మంజులకు సరస్వతి నందీశ్వర అవార్డుతో పాటు 20 మంది ఆయా రంగాల ప్రముఖులకు అవార్డులను ప్రదానంచేసి, ప్రసంగించారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచ దేశాలకే ఆదర్శమని అన్నారు. అ లాంటి గొప్ప సంస్కృతిలో మనం పుట్టి నందుకు గర్వించాలని పేర్కొన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు భారతీయ సాంస్కృతి సంప్రదాయాలపై ఆసక్తి పెంచాలని సూచించారు. సంస్థ నిర్వాహకులు వీరేశ్ యాదవ్ ఏ కార్యక్రమం చేసిన ఎంతో వినూత్నంగా ఉంటుందని తెలిపారు. ఆయన దశాబ్దాల పాటు కలల్ని, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ సభాధ్యక్షత వహించిన వేదికపై సంస్థ అధ్యక్షులు వీరేష్ యాదవ్, రామ్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.